# మేడ్చల్ గొంతు తడిపిన 'భగీరథ'



మేడ్చల్ పట్టణంలో తన ఇంట్లోనే మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న మహిళ




మేడ్చల్ పట్టణంలో నిర్మించిన రెండు సంప్‌లు

- 40ఏండ్ల తాగునీటి కష్టాలు శాశ్వతంగా దూరం
- తరలివచ్చిన గోదావరి
- ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు
- స్వరాష్ట్రంలో తీరిన ఆడపడుచుల క'న్నీటి' బాధలు



మేడ్చల్ మండలం ఘనపూర్ క్షేత్రగిరి గుట్టపై నిర్మించిన 150 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎంబీఆర్(మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)

**మేడ్చల్,నవంబర్ 7:** ఉమ్మడి రాష్ట్రంలో మేడ్చల్ తాగు నీటి కోసం తల్లడిల్లింది. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు కరువై అల్లాడింది. అడుగంటిన భూగర్భ జలాలు, అంతంత మాత్రంగా వర్షాలు, పెరుగుతున్న జనాభాతో కరువు తాండవించింది. నియోజకవర్గంలోని పల్లె, పట్టణం 'కన్నీ'రు పెట్టింది. ఒక్క రోజు కష్టం కాదది. ముప్పై, నలభై ఏండ్ల కష్టం. స్వరాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకంతో మేడ్చల్ గొంతు తడిపారు. 2014 మేలో బాధ్యతలు చేపడితే 2016 ఏప్రిల్ వరకు దాదాపు రెండేండ్లలో ఆడపడచుల బాధలు తీర్చారు.

**జనవరి నుంచే...**

మేడ్చల్ నియోజకవర్గంలో నీళ్ల బాధలు ప్రతి ఏటా జనవరి నుంచే ప్రారంభం అయ్యేవి. భూగర్భ జలాలు అడుగంటి, బోర్లలో నుంచి చుక్క నీరు వచ్చేది కాదు. దీంతో ప్రజలు ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లించి, నీటిని కొనుగోలు చేయాల్సి వచ్చేది. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, దాతలు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటి కోసం మహిళలు బిందెలతో బారులు తీరేవారు. ట్యాంకర్ల వద్ద పానిపట్టు యుద్ధాలు జరిగేవి. ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్డెక్కేవారు. ఈ కష్టాలన్ని గోదారమ్మ రాకతో తీరిపోయాయి.

**రూ.279 కోట్ల వ్యయంతో..**

జంట నగరాల నీటి అవసరాల కోసం మేడ్చల్ మండలం రాజబొల్లారం పంచాయతీ ఘన్‌పూర్‌లో క్షేత్రగిరిపై నిర్మించిన మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజ్వరాయర్ నుంచి మేడ్చల్ మున్సిపాలిటీ, మండలాలకు నీటిని తీసుకెళ్లేందుకు ప్రధాన పైపులైన్, అంతర్గత పైపులైన్, సంప్‌లు, ఓహెచ్‌బీఆర్‌లు, బీపీటీ, ఓహెచ్‌ఆర్‌ఎస్‌ల నిర్మాణానికి రూ.279.25 కోట్ల వ్యయం చేశారు. రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేసేందుకు మేడ్చల్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం వెనుక 1000 కేఎల్ సామర్థ్యంతో రెండు సంప్‌లను నిర్మించారు. వీటిలో ఒకటి మున్సిపాలిటీకి కేటాయించగా, మరొకదాన్ని మేడ్చల్, కుత్బుల్లాపూర్ మండలాలకు నీటిని అందించేందుకు కేటాయించారు. ఈ సంప్ ద్వారా ఆయా మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు డబిల్‌పూర్‌లో 40 కేఎల్ సామర్థ్యంతో ఒక ఓహెచ్‌బీఆర్, 120 కేఎల్ సామర్థ్యంతో గిర్మాపూర్‌లో మరో ఓహెచ్‌బీఆర్‌ను నిర్మించారు. ఘన్‌పూర్ ఎంబీఆర్ నుంచి శామీర్‌పేటకు నేరుగా, ఘట్‌కేసర్, కీసర మండలాలకు నీటిని సరఫరా చేసేందుకు 200 కేఎల్ సామర్థ్యంతో ఒక బీపీటీని కీసర మండలం భోగారంలో నిర్మిస్తున్నారు. ఈ ట్యాంకులు, ప్రధాన పైపులైన్ల నిర్మాణం, పంప్‌హౌజ్, నీటిని తోడే పంప్‌ల ఏర్పాటు కోసం 160 కోట్లు ఖర్చు చేశారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలు, వార్డులకు నీటి సరఫరా చేసేందుకు అంతర్గత పైపులైన్, వోహెచ్‌ఆర్‌ఎస్‌ల నిర్మాణం కోసం రూ.44.50 కోట్లు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులు, పైపులైన్‌కు రూ.14.50 కోట్లు, శామీర్‌పేట మండలానికి రూ.31.87 కోట్లు, కీసర మండలానికి రూ.5.68 కోట్లు, ఘట్‌కేసర్‌కు రూ.13.13 కోట్లు, కుత్బుల్లాపూర్ మండలానికి రూ9.57 కోట్లు మొత్తం రూ.119.25 కోట్లు వ్యయం చేశారు. ఇంటింటికీ నీటి సరఫరాలో కోసం అంతకు ముందున్న వోహెచ్‌ఆర్‌ఎస్‌లను వినియోగించడంతో పాటు కొత్తగా 66 వరకు ఓహెచ్‌ఎస్‌ఆర్(ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్)లను నిర్మించారు. మేడ్చల్ మున్సిపాలిటీతో పాటు ఐదు మండలాలలకు నీటిని అందించేందుకు 256.18 కిలో మీటర్ల ప్రధాన పైపులైన్‌ను నిర్మించారు. ఇందులో 125 కిలో మీటర్లు మేడ్చల్ మున్సిపాలిటీలో ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 240 కిలో మీటర్ల పైపులైన్‌ను నిర్మించారు.



పోచారం, జవహర్‌నగర్‌లో నిర్మించిన సర్వీస్ రిజర్వాయర్లు

**95 ప్రాంతాలకు ప్రయోజనం**

నియోజకవర్గ పరిధిలో చేపట్టిన మిషన్ భగీరథతో 95 ప్రాంతాలకు ప్రయోజనం చేకూరింది. ఘట్‌కేసర్ మండలంలో రింగురోడ్డుకు ఆవల ఉన్న 17 గ్రామాలు, కీసరలో 12 గ్రామాలు, మేడ్చల్‌లో 35 గ్రామాలు, శామీర్‌పేటలో 31 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. నియోజకవర్గంలో రింగురోడ్డుకు అవతలి వైపు ఉన్న గ్రామాలు, మేడ్చల్ పట్టణం దాహార్తిని మిషన్ భగీరథ ద్వారా తీరగా, రింగురోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలు, గ్రామాలకు జల మండలి(హెచ్‌ఎండబ్ల్యూఎస్) నీటిని అందిస్తుంది. గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, పోచారం, పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపాలిటీలు జల మండలి ఇంటింటికీ నీటిని అందించేందుకు భారీ నీటి వ్యవస్థను నిర్మించింది.

- **గుండ్లపోచంపల్లి :** రూ.13.5 కోట్లతో 50 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు. 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఒక జీఎల్‌ఎస్‌ఆర్, ఒక ఈఎల్‌ఎస్‌ఆర్ నిర్మించారు.
- **పోచారం :** 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన 3 రిజర్వాయర్లు, 125 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు. రూ.70 కోట్లు ఖర్చు చేశారు.
- **బోడుప్పల్ :** 50 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కల్గిన 7, 40 లక్షల లీటర్ల సామర్థ్యం కల్గిన నాలుగు ట్యాంకులను నిర్మించారు. 310 కిలో మీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. రూ.66 కోట్లు ఖర్చు చేశారు.
- **పీర్జాదిగూడ :** 12.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కల్గిన 5 ట్యాంకులతో పాటు 5 లక్షల నీటి సామర్థ్యం కల్గిన మరో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. 200 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.100 కోట్లు ఖర్చు చేశారు.
- **జవహర్‌నగర్ :** 1.2 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్లు 3, 1 మిలియన్ లీటర్లు ఒకటి, 3 మిలియన్ లీటర్ల ఒకటి, 5 లక్షల లీటర్ల ఒకటి నిర్మించారు. 250కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు. రూ.100 కోట్లు వ్యయం చేశారు.
- **తూంకుంట :** రూ.65.21 కోట్లతో 10 మిలియన్ లీటర్ల 8 రిజ్వరాయర్లు నిర్మించారు. 185 కిలో మీటర్లు పైపులైన్ ఏర్పాటు చేశారు.
- **నాగారం :** 2.1 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల15 పాత సర్వీస్ రిజరాయర్లు, 4 మిలియన్ లీటర్ల నాలుగు కొత్త సర్వీసు రిజర్వాయర్‌లను నిర్మించారు. 56 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు
- **దమ్మాయిగూడ :** 5.1 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల 20 సర్వీసులు రిజర్వాయర్‌లను నిర్మించారు. 30 కిలో మీటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణం



శామీర్‌పేటలో రేణుక ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న మంత్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

**శామీర్‌పేట, నవంబర్ 7:** శామీర్‌పేటలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి కల్యాణం గౌడ సంఘం, నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.కల్యాణోత్సవంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా తూంకుంట మున్సిపాలిటీలోని దొంగల మైసమ్మ వద్ద మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జడ్పీటీసీ అనితలాలయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్‌యాదవ్, యాదగిరి, హనుమాన్‌దాస్, గౌడ సంఘం అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల సంఖ్య ఆధారంగా.. ఈవీఎం యంత్రాలను సర్దుబాటు చేయాలి

**- నోడల్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఈవీఎం యంత్రాలను సర్దుబాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ నోడల్ అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఎన్నికల పరిశీలకులు అజయ్, వి.నాయక్, దీపక్ మిశ్రా, ఆర్.బాలకృష్ణన్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. అనంతరం, నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్లను జిల్లాకు అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 18న రెండో దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఓటర్ల దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రచారం, సభలు నిర్వహించుకునేలా వచ్చే అభ్యర్థుల దరఖాస్తులకు ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలన్నారు.

### ఓటర్ల స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేయాలి

జిల్లాలో ఓటరు స్లిప్పులను త్వరగా ముద్రించి పంపిణీ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా వ్యహరించాలన్నారు. ప్రధానంగా సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ పక్రియ నిర్వహించే సమయంలో నిబంధనలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ శబరీశ్ పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**శామీర్‌పేట, నవంబర్ 7:** అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో రఘునాథ్‌స్వామి సూచించారు. ఎన్‌క్యూఏఎస్ అసెస్మెంట్‌లో భాగంగా మూడుచింతలపల్లి పీహెచ్‌సీలో సన్నాహక చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్.నారాయణరావు, వైద్యాధికారి డాక్టర్ ధమయంతి, డాక్టర్ కౌశిక్, సర్పంచ్ జాము రవి, డీపీవో మంజూలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.